కథానిక

# పంచదార చిలకలు

వనశ్రీ

అసలు ఆ రామయ్యది మావూరేను. రామయ్య ముత్తాత ముందెప్పుడో వుత్తరాదినుంచివచ్చి మావూళ్ళో స్థిరపడిపోయాడట.

రామయ్య ముత్తాత మావూళ్ళో కాలుపెట్టినప్పుడు తనవెంట వోసెంటుభూమికూడా తెచ్చుకోలేదన్న సంగతి మావూళ్ళో బతికున్నవాళ్ళకూ చనిపోయినవాళ్ళకూ, అందరకూ తెలిసిందేను.

రామయ్య ముత్తాతకు సెంటుభూమంటూ ఒకటేడిస్తే అసలు తను వున్న వూరొదిలి వచ్చేవాడే కాదని మొన్ననే కాలంచేసిన అమరయ్య చచ్చేనాటిదాకా అంటూవుండేవాడు.

అలా నెత్తిన గుడ్డేసుకొచ్చిన రామయ్య ముత్తాత తను పోయేనాటికి కొడుక్కు ఓ పదెకరాల భూవసతికల్పించి పోయాడట.

రామయ్య తాతా, తండ్రీకూడా తక్కువ తిన్నవాళ్ళేంకాదు. కాళ్ళా, వేళ్ళా సంపాదించి రామయ్యకు వప్పచెప్పారు. రామయ్య ఎక్కొచ్చేనాటికి తన పూర్వులు ఆర్జించి వదిలి వెళ్ళింది ఎట్లాలేదన్నా వో ఏభై ఎకరాల పల్లపు భూమీ, పెద్దలోగిలీ, దొడ్లూ, నక్కట్టూ అంతా అట్టహాసంగావుంది.

రామయ్య తాతముత్తాతలంతా ఒకఎత్తూ; రామయ్య ఒక్కడూ ఒకఎత్తు. వాళ్ళంతా కలసి ఎంతసంపాదించారో రామయ్య ఒక్కడే అంత సంపాదించాడండే నమ్మండి. ఇప్పుడు యించుమించు ఓ వందెకరాల మాగాణీ, ఓ పాతికముప్ఫయివేలదాకా రొక్కమూ వుందని అందరూ అనుకోవటం!

అంత ఆస్తీ, రామయ్య ఎట్లా సంపాదించాడయ్యా అంటే నేనుమాత్రంచెప్పలేను. ఆ సంపాదించేకిటుకు, లేదా టెక్నికు మా తాతముత్తాతల్లో ఎవరికీతెలియదనేచెప్పాలి. మా పూర్వీకుల్లో ఆ టెక్నికు ఏ ఒక్కరికి తెలిసినా, నేను యిలా ప్రవేట్లుచెప్పి బతకాల్సిన అవసరమే వుండేది కాదు. మావాళ్ళంతా "మీసాలకు సంపెంగి నూనె"రాసే రకం.

ఆ ఆర్జనా పాటవం రామయ్య వంశంలోనే వుందనుకుంటాను. రామయ్యసంపాదించిన అంత ఆస్తీ యిప్పుడు తినే దిక్కులేకుండాపోయింది. అంత వయసుముదిరి, అయిదో పడిలోపడ్డాకనే రామయ్య రెండోపెళ్ళి చేసుకొన్నాడు. వంశవృక్షాన్ని నిలుపడంకోసం రామయ్య చేయని ప్రయత్నంలేదు. అయినా యీనాటివరకూ ఓ నలుసైనా కలుగలేదంటే రామయ్య వారసుల పూర్వజన్మ సుకృతమనేచెప్పాలి.

రామయ్య దురదృష్టంకాకపోతే మరేమిటి? నిండు గర్భిణితోవున్న మొదటిభార్య మరణించడం. చచ్చినపెళ్లాంకంటే పుట్టకుండానే చచ్చిపోయిన సంతుకోసం ఎక్కువ దిగులుపడ్డాడు రామయ్య.

పాపమెంతో పుణ్యమెంతోగాని రామయ్య మొదటిపెళ్ళాం చావుకు రామయ్యే కారణమనేది యీనాటికీ మావూళ్ళో చెప్పుకుంటూవుంటారు.

కడుపుతోవున్న రామయ్యపెళ్లానికి పంచదార చిలకలు తినాలనిపించి మొగుడికితెలీకుండా చాటుమాటుగా కోట్లోవున్న రెండుబస్తాల వడ్లు అమ్మి పుట్టింటికి పంపించిందట, తల్లిని చిలకలు చేసిపంపమని. వాళ్లు కాస్త బీదతనంలో వున్నవాళ్ళలెండి.

అది తెలిసి రామయ్య, పంచదార చిలకలు పండుకొచ్చిన అత్తగారిముందే, పెళ్ళాన్ని గొడ్డునుబాదినట్లు బాదేడేట పాపం! ఆ నిర్భాగ్యురాలు లజ్జతో కుమిలిపోయి, తెల్లారగట్ల మంచినీళ్ళ భావిలో బుడుంగుమంది. ఆ బుడుంగుమనేది, ఆ బిడ్డనుకాస్తా కనేశాక బుడుంగుమంటే రామయ్యకు యింత దుఃఖం వుండేదికాదు.

మొదటిభార్యచనిపోయినఆరునెల్లకే రామయ్య రెండోపెళ్ళి చేసుకొన్నాడు. ఆవిడ కాలుపెట్టినవేళావిశేషమేమిటో కాని, రామయ్య పట్టుకుంది బంగారమయి కలిసొచ్చింది. రామయ్య చిన్నపెళ్ళాం వేలువిడిచిన మేనమామ వెంకయ్యతో కలిసి రామయ్య కొంతకాలం మిరప

కాయలబేగం చేశాడు. వ్యాపారం అట్టాపెంచి యిట్టాపెంచి వున్నదికాస్తా వెంకయ్య బావ, రామయ్య బావను నమ్మి అందులోపెట్టి వూరుకొన్నాడు. అయిదుసంవత్సరాల తర్వాత లెక్కాడొక్కా తేల్చి చూసుకొంటే, చెరో పదివేలు మిరపకాయబోరాం తాలూకు చినిగిపోయిన గోనె పట్టాలుమాత్రం మిగిలినాయి! వ్యాపారం దివాళా తీసింది! రామయ్య పొగరు అణిగింది లెమ్మని అందరూ చంకలు కొట్టారు. పిల్లలుగల వెంకయ్యబావ గుండెలు చలికిలబడ్డయి. పొలం పుట్రా అప్పులోళ్ళు కట్టుకుపోగా, వెంకయ్య బావ గుడ్లుతేలేసి కాళ్లు పైకెత్తాడు. అమాయకుడు వెంకయ్యకు మతి చెలించింది. రామయ్య బావే సమయానికి ఆదుకొని వెంకయ్య బావను ఎరుకలపూడి పిచ్చాసుపత్రిలో చేర్పించాడు. అక్కడెన్నాళ్లుంచినా నయం కాలేదు. పాపం రామయ్యమాత్రం ఏం చేస్తాడు. ఎంతకాలమని నయంకాని పిచ్చికి డబ్బు తగలేస్తూ వుంటాడు? డబ్బు తగలేస్తే పిచ్చి నయమవుతుందనే పిచ్చి రామయ్యకు ఎప్పుడూలేదు. లోకంతో సంబంధం లేని రామయ్యకూడా లోకుల్నిచూసి వెరవాల్సి వచ్చింది. అందుకే వెంకయ్య బావ పిచ్చాసుపత్రి కర్చు తనేపెట్టుకుంటూవచ్చాడు. కుచేలుడైతేమాత్రం ఎంతకాల మనుభవిస్తాడు? రామయ్య డబ్బు పంపడం మానేసిన మూడో రోజునే వెంకయ్యను పిచ్చాసుపత్రినుంచి వదిలేసినట్టు తెలిసింది. అప్పట్నుంచీ పిచ్చెక్కిన వెంకయ్య ఎటుపోయాడో, ఎక్కడ తిరుగుతున్నాడో యెవరికీ తెలియదు. ఆ వూరూ, ఈ వూరూ పోయొచ్చినవాళ్లు వెంకయ్యను రైలుపెట్టెల్లో అడుక్కుంటూంటే చూశామనీ, కాఫీ హోటళ్ళముందు తిని పారేసిన ఆకులు నాకుతూంటే చూశామనీ చెప్తూండేవాళ్లు.

అందరూ అనుకొన్నట్టుగా, మిరపకాయల వ్యాపారంలోనష్టంవచ్చిరామయ్యఆస్తిలోసగానికి పైగా హరించుకుపోయి వుంటుందన్నదిజరగలేదు. పైగా రామయ్య ఇంకోపాతిక ఎకరాలు కొనడం జరిగింది. వెంకయ్యపిచ్చాసుపత్రివదిలి దేశాలమీద పోయిన కొద్దిరోజులకే రామయ్య పాతిక ఎకరాల మాగాణీ కొనటం జరిగింది. ఊళ్ళో పెద్ద తలకాయలన్నీ ముక్కుమీద వేలేసుకొన్నాయ్!

ఆ తర్వాత రామయ్యమీద ఎన్నో నీలాపనిందలు వేయడం కూడా జరిగింది. అసలు మిరపకాయల బేరంలో నష్టం రాలేదనీ, అమాయకుడైన వెంకయ్యను మోసం చేయడానికే బేరంలో నష్టమొచ్చినట్టు రామయ్య నాటక మాడేడనీ, ఆ నోటా ఆనోటా చెప్పుకొన్నారు. వెంకయ్య బావకు పిచ్చెక్కటానికూడా రామయ్యబావే ఏదో చేశాడన్నది కూడా కొంతమంది చెప్పుకోక పోలేదు.

ఎలా సంపాదిస్తే యేం, రామయ్య వూళ్లో కల్లా మోతుబరీ రైతయ్యాడు. లోకానికి ఎదురీదగలిగిన రామయ్య కూడా కాలానికి ఎదురీద లేకపోయాడు. అరవయ్యోపడిలో పడేసరికి రాయంటి రామయ్య మంచాన పడ్డాడు. అక్కడ్నుంచీ రామయ్య కష్టాలు మొదలైనయ్. తినేదిక్కులేక మూలుగుతోన్న ఆస్తికోసం వారసులంతా కాకుల్లా గద్దల్లా మూగారు. రామయ్య మంచంచుట్టూ చేరినవాళ్ళలో రామయ్యకు నిజముగా జబ్బు నయంకావాలని, మనసారావాంఛించినవాళ్లు వొక్కళ్లుకూడా లేరు. రామయ్య మంచం చుట్టూ మొసలికన్నీళ్లు నయాగరా జలపాతంలా ప్రవహించినయ్! తనచుట్టూ చేరిన వాళ్లంతా తన చావుకోసం గంటలూ, నిమిషాలూ లెక్కపెడుతూన్నట్టుగాఅనిపించేది రామయ్యకు. రామయ్యఆప్తులు ఆశించినంత త్వరగా రాలేదు రామయ్యకు చావు. రామయ్యకోసంగా వస్తూవున్న మృత్యువు తాబేలు నడకతో వస్తోంది. రామయ్య మృత్యువుతో అహోరాత్రాలూ యుద్ధం చేస్తున్నాడు. బంధువుల్ని పెళ్ళాంతో సహా అందర్నీ యింటినుండి దూరంగాకొట్టాడు. తన చావుకోసం గుంటనక్కల్లా కనిపెట్టుకు కూర్చున్నవాళ్ళు తనను బతికుండగానే పీక్కుతింటూన్నట్టనిపించింది. ఆస్థితిలో కూడా రామయ్యకు మొండిధైర్యం వుంది. తన ఆస్తినుంచి తన్నెవరూ వేరుచేయలేరని.

రామయ్యకు అప్పుడప్పుడు డాక్టర్ల మీదా మందుల మీదా అనుమానం కలిగేది. క్షీణించిపోతూన్న శరీరం కోసం, మందులకూ, మాకులకూ, డాక్టర్లకూ డబ్బు ధారపోయడం దారుణంగా అనిపించేది రామయ్యకు. రామయ్య శరీరాన్ని మృత్యువు వేరుచేయగలిగినా, రామయ్య

ఆత్మను అతని ఆస్తినుంచి వేరుచేయలేదనే విశ్వాసము రామయ్య రక్తనాళాల్లో జీర్ణించి పోయి వుండాలి.

తాబేలైనా, నడవంగా నడవంగా తన గమ్యాన్ని చేరుకుంటుంది కదూ! వానపాములా, మందగొండిగా డేక్కుంటూవచ్చిన మృత్యువు ఓ రోజు అర్థరాత్రివచ్చి రామయ్య యింటి తలుపు తట్టింది!

అర్ధరాత్రి రామయ్య పడకగదిలో గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది. జీవితాన్ని మృత్యువుకు చేరవేసే కాలాన్ని కొలుస్తూ గడియారం రామయ్య జీవితాన్ని ఆఖరి ఘడియల్లోకి నెట్టింది.

రామయ్య నీరసంగా లేచి మందుతాగి, దిండు కింద దాచుకొన్న నారింజబద్దల్ని రెంటిని చప్పరించి మిగతావి తెల్లారి మందుతాగ్గానే తింటానికి దాచుకొని పక్క సర్దుకొని మళ్ళీ పడుకొన్నాడు.

కాని రామయ్యకు ఆ రాత్రి అసలు నిద్దర పట్టలేదు. గుండె దడా, ఆయాసం ఎక్కువగా వుంది. ఎదురుగా గోడకున్న మొదటిభార్య ఫోటో చూస్తూంటే రామయ్యకు మరీ గుబులు గుబులుగా వుంది.

వెనకగదిలో ఏదో చప్పుడైనట్టుంది. రామయ్యకు అలంకుగా వినపడ్డట్టయింది. ఆదుర్దాగా బొడ్లో తాళాచెవ్వుల గుత్తికోసం తడువుకొన్నాడు. బొడ్లో చెవ్వులగుత్తి చేతికి తగలకపోయేసరికి రామయ్య గుండెలు తార్మన్నాయ్. ఒళ్ళంతా ముచ్చెమటలుపోశాయి. సాయంత్రం డాక్టరుకు డబ్బు యివ్వటానికి పెట్టె తెరిచినప్పుడు తాళంచెవ్వులగుత్తి అక్కడెక్కడో మరిచిపోయినట్టుగా గుర్తువచ్చింది.

వంట గదిలోంచి "గభీగభీ" మని తలుపు వుతకలు లేవనెట్టుతున్నట్టు శబ్దం వినపడుతోంది. రామయ్య ఆయోమయంగా లేచి నుంచొన్నాడు. కళ్లు మసకలు కమ్మిపోతున్నాయ్. తలతిరిగిపోతూన్నట్టనిపించింది. వణుకుతున్న కాళ్లతో తడబడుతూ, గదితలుపు తీసుకొని వరండాలోకొచ్చాడు. మెట్లపక్కనే గోడకానుకొని ఒక నల్లటి ఆకారం నుంచొనివుంది.

ఆ ఆకారాన్ని చూడగానే రామయ్య తన ఆస్తికోసం వచ్చిన దొంగ అనుకొన్నాడు. కాని, పాపం అది రామయ్య అస్థికలకోసం వచ్చిన మృత్యువు కూడా అని గ్రహించలేకపోయాడు.

రామయ్య ఆ నీడలోవున్న ఆకారాన్ని చూడగానే వెర్రిగా కేకలుపెట్టాడు. రామయ్య కేకలకు ఆ గోడపక్కనవున్న దొంగాడు మెట్ల క్రిందవున్న మూటను చంకలో పెట్టుకొని పరుగుకు లంకించుకొన్నాడు. రామయ్య మతిపోయినవాడిలా "దొంగ, దొంగ! పట్టుకోండి" అంటూ అరుస్తూ దొంగగాడి వెంటబడ్డాడు. రోగపు బిర్రు నరాలకెక్కిందో ఏమో మరి రామయ్య ప్రాణానికి తెగించి మరీ వెంటబడ్డాడు. వంశానుబంధంగావచ్చిన రామయ్య ధనకాంక్ష కట్టలు తెగింది. ఆ దొంగాడు తనప్రాణాన్నే యెత్తుకుపోతున్నట్టుగా యిదయిపోయాడు రామయ్య! తలతెగిపోయిన బలిపోతులా రామయ్య దొంగాడి వెంటబడ్డాడు. వీధి మలుపు తిరిగేసరికి దొంగాణ్ణి వాటేసుకోగలిగాడు. దొంగాడి చంకలోవున్న మూటకోసం రామయ్య పెనుగులాట సాగించాడు. అంతలోకే చుట్టుపక్కలవాళ్ళు లేచి వచ్చారు. ఆ మూటకోసం పెనుగులాటలో రామయ్యకు గుండెలమీద గట్టిగా రెండుతగిలినై. అయినా రామయ్య మూటను వదలలేదు. అంతలోకే నలుగురూచేరి దొంగాణ్ణి చచ్చేట్టుబాదేరు. నెత్తురు కక్కుతూ దొంగాడు నేలక్కరుచుకొన్నాడు. రామయ్య స్పృహతప్పినా చేతుల్లోని మూటను వదల్లేదు. ఎవళ్లకు తోచిన వుపచారం వాళ్లు చేస్తూ, డాక్టరుని పిలవనంపేరు. రామయ్యకు గుండెలు చేదుకుపోతున్నాయ్! మధ్యలో ఓసారి తెలివివచ్చింది. రామయ్య కడసారి కోరికగా ఆ మూట విప్పితీసి చూపించమన్నాడు. బలువుగావున్న కనిరెప్పలెత్తి రామయ్య లాంతరు వెలుగులో మూటలోవున్న వాటిని చూసుకొన్నాడు! అందులో - వెండిపళ్లాలూ, బిరుసు కరన్సీనోట్లూ, బంగారపుసుద్దలూ వూహించిన రామయ్య మనసుకు-మురికిగుడ్డ పీలికలూ కుండ పెంకులూ, పుల్లిస్తరాకులూ మూసుకుపోతూన్న రామయ్య కళ్ళకు కనిపించినాయి.

తెల్లవారేక రాత్రి చనిపోయిన దొంగాడు

పిచ్చివాడు వెంకయ్యేనని వూళ్ళో చాలామంది గుర్తుపట్టేరు.

ఆ రాత్రే చనిపోయిన రామయ్య బావకు వెంకయ్య బావ సంగతే తెలియదు.

రామయ్య చనిపోయిన తెల్లారే వారసులు వచ్చి అందినంతవరకు పుచ్చుకొని తలో కాస్తా పంచుకొని చక్కా పోయారు.

ఆ తర్వాత కొన్నాళ్ళకు వూళ్ళో వాళ్ళు చందాలు వేసుకొని వెంకయ్యకు సమాధి కట్టిస్తూ, దానిపక్కనే మిగిలిపోయిన సున్నం, ఇటుకతో రామయ్యకూడా ఓ సమాధి కట్టించారు. తను బ్రతికుండగా ఒరులను సుఖంగా బ్రతకనీకా, తాను సుఖపడకా బ్రతికిన రామయ్య లోభులు కట్టించిన ఆ సమాధిలోనైనా సుఖపడ్డాడో లేదో!

స్కెచ్

# మారనిలోకంలో మారే మనిషి

నిట్టల శ్రీరామమూర్తి

మెత్తని బూరుగుదూది తలగడలో తలనుగుచ్చి, కళ్ళల్లో పడే ముంగురులనైనా సర్దుకోకుండా ముఖమల్ పరుపుని అంటిపెట్టుకుని, కాళ్లూ చేతులూ ముడుచుకొని, శాలువ వెచ్చదనం అనుభవిస్తూ పడుకున్నాడు మధు. పసితనపు పాల పొంగుతో మిసమిసలాడే మీగడతరక మధు. అమాయకత్వం, అజ్ఞానం, ఐక్యంచెందిన ఆ ఎనిమిదేళ్ళ ప్రాయంలో ఆ చిట్టి బుర్రలో ఎన్ని ఊహలు! ఆ సుకుమార హృదయంలో యెన్ని కదిలికలు! మృదువైన దిండుపై, అంతకంటే మృదువైన చెంపను చేర్చి, దోమతెర చిల్లుల గుండా, కిటికీ ఊచల సందుల్లోంచి ఆకాశం కేసీ, అందులో మిన్కుమిన్కుమనే నక్షత్రాల కేసీ చూస్తూ పడుకున్నాడు. "ఎన్ని నక్షత్రాలో ఒకటి, రెండు, మూడు...అబ్బ, ఇంక లెక్కపెట్టలేను. ఎన్నున్నాయో. ఈ బుల్లిబుల్లిదీపాలు ఎంతదూరంలో ఉన్నాయో?" ఆ వయసులో ప్రపంచం, జీవితం అంటే మధుకి తెలిసినంత వరకూ మేష్టారూ, నేస్తాలూ, అమ్మచేసే అప్పచ్చులూ అనే. "ఈసారి లెక్కల్లో ఫస్టుమార్కు రావాలి. వెంకాయిగాడు ఒక్క మార్కులో తనని దాటేస్తున్నాడు. వీళ్ళందర్నీ ఓడించి తనే ఫస్టుగా ఉండాలి. అవునుగాని నర్సిగాడు మరీ ఇదమ్మా. ఉట్టి అబద్ధాలకోరు. ఏ ఆటలో చేర్చుకున్నా చిడింత్రాలు చేయటమే. గోళీకాయలు ఆడేనని నాన్నకి కోపంవచ్చింది. అందులో మజా ఆయనకేం తెలుసు. నాన్న మరి చిన్నప్పుడు గోలీలు ఆడలేదా? అమ్మ అప్పచ్చులు చేస్తానంది రేపు. ఎంచక్క చేగోణీలూ, జంతికలూ జేబులో పోసుకుని ఒక్కొక్కటే తింటూ అందరినీ ఊరిస్తాను. అబ్బ నోరూరుతోంది..." మధు పడుకున్నాడు, లేతమెదడులో చిట్టి ఊహాలు నిర్మించుకుంటూ. నక్షత్రాలు మిన్కుమిన్కుమంటున్నాయి అమాయకంగా సానుభూతితో. రాత్రంతా చేగోడీలు తిన్నట్టు కలలే. నర్సిగాడు ఇంకా కాస్త పెట్టమని బతిమాలుతున్నాడు. ఆకాశం నిండా చేగోడీలే...

పదేళ్ళ తర్వాత—

దోమతెర చిల్లులగుండా కిటికీఊచల సందుల్లోంచి ఆకాశాన్నీ నక్షత్రాల్నీ చూస్తున్నాడు మధు. "లలిత లేకపోతే క్లాసులో ఏంతోచదు. అస్తమానం ఆమె కేసి చూడాలనీ, ఆమెతో మాట్లాడాలనీ ఉంటుంది. తీరా మాట్లాడితే ఆమెకేం కోపంవస్తుందో! ప్రిన్సిపాలుకి రిపోర్టు చేస్తుందేమో! రేపు నోటుబుక్ అడుగుతాను. ఏమంటుందో చూద్దాం. అయితే ఇంతకీ రేపు ఏం డ్రెస్ వెయ్యను? ట్వీడ్ వేస్తే లలితకి నచ్చుతుందా. లాల్చీ వెయ్యనా? ఈసారి ఫుట్ బాల్ మాచ్‌కి కాలేజీ గరల్స్ అంతా వస్తారు. తన ఆట గొప్పతనం ఆనాడు చూపించాలి..." స్టంటు పిక్చర్లూ, కత్తియుద్ధాలూ, బాక్సింగూ అంటే మధుకి సరదా. సెకండ్ షో సినిమాలూ, నాటకాలూ, తీర్థాలూ, సంబరాలూ, కొండగుట్టలు ఎక్కడం, సముద్రంపై బోటుషైర్లూ చాలా సరదా మధుకి. సినీ హీరోలా ఉండాలనుకుంటాడు లలిత సమక్షంలో. రాజకీయాల్లో ముం